




నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. ఆయన వెంట సీసీకుంట మాజీ ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, వివిధ మండలాల ముఖ్య నాయకులు ఉన్నారు.

– భూత్పూర్, జనవరి 2



క్రికెటర్ కేతన్‌ను శాలువాతో సత్కరించి అభినందిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

# ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- క్రికెటర్‌ను అభినందించిన మాజీ మంత్రి హరీశ్‌రావు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల, జనవరి 2 : ఇటీవల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన అండర్–14 క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారుడు కేతన్‌యాదవ్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అభినందించారు. మహబూబ్‌గనర్ జట్టు తరపున పాల్గొని 138 బంతుల్లో 236 పరుగులు చేసి అద్భుత ప్రదర్శన కనబర్చిన జడ్చర్ల మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు కేతన్‌ను గురువారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ అద్భుత ప్రదర్శనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శ్రీనివాస్‌యాదవ్, ప్రణీల్, బీఆర్‌ఎస్ నాయకులు కరాటే రాజు, ఆంజనేయులు ఉన్నారు.

# గ్రామాలు అభివృద్ధి చెందాలి



బాధిత కుటుంబసభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, జనవరి 2 : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాలని, అందుకు తాను పూర్తిగా సహకరిస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలో ప్రతిగ్రామం అభివృద్ధి చెందాలని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం ఇటిక్యాల మండలం శివనాంపల్లికి చెందిన పెద్ద నర్సింహులుకు రూ.18 వేలు, ఇటిక్యాలకు చెందిన హుస్సేన్‌కి రూ.57 వేలు, ఇటిక్యాల మండలం పెద్దదిన్నెకు చెందిన వినయ్‌కుమార్‌కి రూ.29 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో గజేందర్‌రెడ్డి, రఘురెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# జల విద్యుత్ కేంద్రానికి ముప్పు లేదు



మాట్లాడుతున్న చీఫ్ ఇంజినీర్ రామసుబ్బారెడ్డి

- వాటర్ లీకేజీపై సోషల్ మీడియాల్లో తప్పుడు ప్రచారం నమ్మొద్దు
- చీఫ్ ఇంజినీర్ రామసుబ్బారెడ్డి

దోమలపెంట, జనవరి 2 : అమ్రాబాద్ మండలంలోని శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో నీటి దారా లీకేజీ వల్ల జల విద్యుత్ కేంద్రానికి ఎలాంటి ముప్పులేదని చీఫ్ ఇంజినీర్ రామ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో నీటిదార వల్ల పవర్‌హౌస్‌కు ప్రమాదం జరుగుతుందని సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం జరుగుతుందని, జల విద్యుత్ కేంద్రంలో నీటి ఊట రావడం సర్వసాధారణమని, ఇలాంటి ప్రచారాలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. జల విద్యుత్ కేంద్రం లో యూనిట్–1కు సంబంధించి డ్రాఫ్ట్ ట్యూబ్ వద్ద నీటి ఊట వస్తుందని డిసెంబర్ 25న గుర్తించి వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మా అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, లీకేజీకి మరమ్మతులు నిర్వహించే పనిలోనే ఉన్నారని వివరించారు.

# 'డబుల్' ఇండ్లు కేటాయించాలి

- మౌలిక సదుపాయాలు, నీటి వసతి కల్పించాలి
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

నమస్తే ఎఫెక్ట్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 2 : నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని జిల్లా అధికారులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. డిసెంబర్ 31వ తేదీన 'గృహయోగం ఎప్పుడో..?' అన్న శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ఇచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు, పురోగతిపై సమీక్షించారు. పూర్తయిన ఇండ్ల వద్ద మౌళిక వసతులు కల్పించాలని ఆదేశించారు. నీటి కనెక్షన్ లేని ఇండ్లను మిషన్ భగీరథ అధికారులు పరిశీలించి కనెక్షన్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని మౌలాలిగుట్ట, ఏనుగొండ, మదనపల్లితండా, అల్లీపూర్, చౌదర్‌పల్లి, ఓబులాయపల్లి, కోడూరు, ఫతేపూర్, యారోనిపల్లిలో నిర్మాణాలు పూర్తయిన వాటిని లబ్ధిదారుకు కేటాయించాలని సూచించారు. మంజూరు చేసిన రూ. 9.07 కోట్లతో కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. హౌసింగ్ అధికారి భాస్కర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 3,550 డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయగా 2,929 పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా 410 ఇండ్లు నిర్మాణ దశల్లో.. 211 నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 2,667 ఇండ్లు కేటాయించినట్లు వివరించారు. అనంతరం వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్, నీటి పారుదల శాఖ ఎస్‌ఈ చక్రధరం, పంచాయతీరాజ్ ఈఈ నరేందర్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ వెంకటరెడ్డి, ఇంట్రా ఈఈ పుల్లారెడ్డి, ఆర్డీవో నవీన్, అధికారులు పాల్గొన్నారు.




జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్

### డబ్బులెప్పుడిస్తారో తెలియదు..



నాపేరు మడిగ నర్సింహ, మాధవరావుపల్లి గ్రామం, పాన్‌గల్ మండలం. నాకున్న 2.35 ఎకరాల్లో వరి సాగుచేస్తే 193 సన్నరకం బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. సింగిల్‌విండో అధికారులు, సిబ్బంది ధాన్యం బస్తాలు లోడ్ చేసి తీసుకుపోయారు. పది రోజులు అవుతున్నా నా బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ కాలేదు. ఇంటి అవసరాలతోపాటు ఇతర అవసరాల నిమిత్తం డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాను. చాలా మంది రైతులకు డబ్బులు పడలేదని తెలుస్తోంది. ధాన్యం అమ్మేది ఓ ఎత్తు అయితే డబ్బులు ఖాతాలో పడడం మరో ఎత్తుగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. ఇప్పటి వరకు రైతుభరోసా ఇవ్వలేదు. ఇస్తారో.. ఎగ్గొడతారో చూడాలి.

### ఇంకా డబ్బులు జమ కాలేదు..



నాపేరు రాములు. కేతేపల్లి మా గ్రామం, పాన్‌గల్ మండలం. నాకున్న 3.20 ఎకరాల్లో బీపీటీ సన్న రకం వరి సాగుచేశాను. 153 బస్తాలు పంట దిగుబడి రాగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే అమ్మాను. ధాన్యం అమ్మి 11 రోజులు అయినా డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమకాలేదు. డబ్బులు ఎప్పుడు పడతాయని నిర్వాహకులను అడుగగా అప్పుడు.. ఇప్పుడు.. అంటూ తిప్పుతున్నారు. డబ్బులు అకౌంట్లో జమ అయితేనే పంటసాగుకు తెచ్చిన అప్పులు కట్టాలి. మళ్లీ యాసంగి పంట సాగుకు పెట్టుబడికి కావాలి. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు వస్తే మా అవసరాలు తీరే అవకాశం ఉంది. ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందే తప్పా ఎవరికీ డబ్బులు సక్రమంగా చెల్లించడం లేదు.

- కర్షకులకు చెల్లించాల్సిన బకాయి డబ్బులు రూ.70 కోట్లు
- రూ.25 కోట్ల బోనస్ కోసం రైతన్నల ఎదురుచూపులు
- 20 రోజులైనా అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు
- వనపర్తి జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం
- ఇప్పటి వరకు కొనుగోలు చేసింది.. లక్షా 91 వేల టన్నులే..



దేవరకద్ర మార్కెట్ యార్డులో ధాన్యం తూకం వేస్తున్న సిబ్బంది (ఫైల్)

# ధాన్యం.. దైన్యం

## రైతుకు అందని డబ్బులు

వనపర్తి, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వరి ధాన్యం విక్రయాలు చివరి దశకు చేరుకున్నాయి. వానకాలం సీజన్‌లో భారీఎత్తున వరిని సాగు చేసిన రైతన్నకు ధాన్యం అమ్ముకోవడానికి తంటాలు పడక తప్పడం లేదు. జిల్లాలో ఈ సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ లక్ష్యంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అంచనాలతో నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటి వరకు లక్షా 91వేల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. దీని బట్టి చూస్తే చాలా మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్ముకున్నట్లు అర్థమవుతున్నది. అయితే జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులు డబ్బులు చెల్లించాలని ఆందోళనలు చేస్తున్నారు. రైతుల ఖాతాల్లో వేగంగా డబ్బులు జమ చేస్తామన్న ప్రభుత్వం అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదు.

**రూ.70 కోట్లు పెండింగ్**

వరి ధాన్యం విక్రయాలు జరిపిన రైతులకు ప్రభుత్వం నుంచి డబ్బులు సకాలంలో అందడం లేదు. ఇలా అమ్మి అలా డబ్బులు తీసుకొండని సర్కార్ ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చకపోవడంతో ఆటకెక్కుతుంది. ఈ పరిస్థితిలో 20రోజులైనా డబ్బులు పడని క్రమంలో అన్నదాతలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులకు రూ.70 కోట్ల వారి అకౌంట్లలో జమ కావాల్సి ఉంది. అయితే డబ్బులు పౌరసరఫరాల శాఖ పరిధిలో ఉన్నప్పటికీ రైతులకు అందడం లేదని తెలుస్తోంది. ధాన్యం అమ్మిన తర్వాత ఆ కేంద్రం ద్వారా రావాల్సిన సమాచారం జిల్లా కేంద్రానికి సకాలంలో చేరడం లేదు. దీంతో డబ్బులు పడని పరిస్థితి ఉత్పన్నమవుతున్నట్లు సమాచారం. ఆయా కేంద్రాలు, రైస్ మిల్లర్ల ద్వారా జిల్లా కేంద్రానికి రైతుల ధాన్యం వివరాల ధ్రువీకరణలు అందక పోవడంతో పెండింగ్ పడుతున్నట్లు తెలిసింది. ఆయా శాఖల అధికారుల్లో సమన్వయం లోపించడం తోనే సమయానికి వారి అకౌంట్లలో డబ్బులు జమ కాకపోవడంతో అన్నదాతలు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

**బోనస్ కోసం ఎదురుచూపులే..**

ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. ఇప్పటి వరకు జిల్లాలో 20వేల మంది రైతులు దాదాపు లక్షా 11వేల మెట్రిక్ టన్నుల సన్న రకం వడ్లను ప్రభుత్వానికి విక్రయించారు. అయితే వీరిలో ఇంకా చాలా మంది రైతులకు బోనస్ డబ్బులు రాలేదని చెబుతున్నారు. దాదాపు రూ. 25 కోట్ల బోనస్ పడాల్సి ఉన్నట్లు రైతులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రారంభంలో ఎంఎస్‌పీ ధర ప్రకారం డబ్బులు పడిన రెండు, మూడురోజులకే బోనస్ డబ్బులు కూడా రైతుల ఖాతాల్లో పడ్డాయని చెబుతున్నారు. క్రమంగా బోనస్ ఇవ్వడంలో ఆలస్యం చేస్తూ జాప్యం చేస్తున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం డబ్బులు పడిన రైతులకు 15 రోజులు గడిచినా కూడా సన్న వడ్ల బోనస్ పడటం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో జిల్లాలో రెండు రకాలుగా రైతులు వరి ధాన్యం డబ్బులు అందక అవస్థలు పడుతున్నారు.

**మిగతా ధాన్యం ఎక్కడ..?**

జిల్లాలో 4లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ లక్ష్యం ఉంది. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు సెంటర్ల ద్వారా సగం ధాన్యాన్ని కూడా కొనుగోళ్లు చేయలేదని లెక్కలు చెబుతున్నాయి. వీటిని బట్టి మిగితా ధాన్యం ఇంకా రైతుల వద్ద ఉందా..లేక ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారా అన్నది స్పష్టం రావడం లేదు. జిల్లాలో 262కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ప్రారంభించింది. నవంబర్ నెల నుంచి కొనుగోళ్ల ప్రక్రియ జిల్లాలో కొనసాగుతున్నది. రెండు నెలలుగా విక్రయాలు జరుగుతున్నా.. ఇంకా జిల్లాలో సగం కూడా ధాన్యం కొనుగోళ్లు జరిగినట్లు కనిపించడం లేదు. దీనిని బట్టి మిగిలిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాల్సి వస్తే...ఇంకెంత కాలం పడుతుందోనన్న ప్రశ్నలు మొదలవుతున్నాయి.

### నెలరోజులైనా డబ్బులు రాలే..



నేను ప్రభుత్వానికి 109 క్వింటాళ్ల బియ్యాన్ని అమ్మాను. ధాన్యం అమ్మి నెల రోజులైనా ఇప్పటికీ డబ్బులు నా అకౌంట్‌లో జమ రాలేదు. అదేవిధంగా దాదాపు నాకు రూ.60 వేలు బోనస్ రావాల్సి ఉంది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు పథకం ద్వారా ఎకరాకు రూ.4వేల చొప్పున ఇచ్చింది. దాని వలన పంట సాగుకు పెట్టుబడిగా రైతుబంధు పథకం ద్వారా వచ్చిన పైసలను వాడుకునేవాళ్లం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తామని చెప్పి నా ఇప్పటి వరకు చెల్లించలేదు. చాలా సార్లు బ్యాంకుల చుట్టూ తిరిగినా లాభం లేదు.

– సంజీవరెడ్డి, రైతు, వడ్డేవాట, కొత్తకోట మండలం

## రాష్ట్ర స్థాయి నెట్‌బాల్

# విజేత పాలమూరు



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు

- బాలికల విభాగంలో ఖమ్మం..
- రన్నరప్‌గా బాలికల జట్టు మహబూబ్‌నగర్, బాలుర జట్టు ఖమ్మం..
- మూడోస్థానంలో బాలుర జట్లు నారాయణపేట, మేడ్చల్
- బాలికల విభాగంలో రంగారెడ్డి, మేడ్చల్ ..
- ముగిసిన సీఎం కప్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 2 : జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో గురువారం సీఎం కప్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీ కొనసాగింది. ఈ పోటీల్లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చి విజేతగా నిలిచింది. రన్నరప్‌గా ఖమ్మం జట్టు, బాలికల విభాగంలో ఖమ్మం జట్టు విజయం సాధించగా రన్నరప్‌గా మహబూబ్‌నగర్ జట్టు నిలిచింది. బాలుర జట్లలో మూడో స్థానంలో నారాయణపేట, మేడ్చల్ జిల్లాల జట్లు, బాలికల విభాగంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా జట్లు నిలిచాయి

**చివరి వరకు ఉత్కంఠ..**

బాలబాలికల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠంగా కొనసాగాయి. ఆయా జట్ల మధ్య నువ్వానేనా అనే రీతీలో తలబడ్డాయి. చివరి వరకు పోరాడిన ఫైనల్ మ్యాచ్‌లో బాలుర మహబూబ్‌నగర్ జట్టు 19–16 పాయింట్ల తేడాతో ఖమ్మం జట్టుపై విజయం సాధించింది. బాలికల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం 23–06 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందింది. మూడో స్థానంలో బాలుర జట్లు నారాయణపేట్, మేడ్చల్ 12– 12 స్కోర్‌తో మ్యాచ్ డ్రా కాగా.. బాలికల జట్లు 12–12 తేడాతో రంగారెడ్డి, మేడ్చల్ జట్లు నిలిచాయి. అనంతరం విజేత జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి సహకారంతో సీఎం కప్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు విజయవంతంగా ముగిశాయని, రాష్ట్రస్థాయి పోటీలకు సహకరించిన క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సత్యనారాయణ, పశువైద్యాధికారి మధుసూదన్ రెడ్డి, నెట్‌బాల్ ప్రధాన కార్యాదర్శి ఖాజా ఖాన్, ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి విలియం, యోగా సంఘం ప్రధాన కార్యదర్శి బాలరాజు, కురుమూర్తి గౌడ్, వేణుగోపాల్, రవీందర్‌రెడ్డి, విజయకుమార్, ఉమేశ్‌కుమార్, బాస్కెట్‌బాల్ కోచ్ ఫారుక్, స్వప్న సుధాకర్, అరుణజ్యోతి పాల్గొన్నారు.



నారాయణపేటలో సీఎం, మంత్రుల ఫొటోలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు


# హోరెత్తిన నిరసనలు

- పాలమూరులో మొఖాలకు సీఎం, మంత్రుల చిత్రపటాలు ధరించి ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల వినూత్న ర్యాలీ

సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతున్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా రోజుకో విధంగా వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు మొఖాలకు సీఎం రేవంత్, మంత్రుల చిత్రపటాలను ధరించి ర్యాలీ చేపట్టారు. అలాగే మహబూబ్‌నగర్‌లోని దీక్షా శిబిరం నుంచి నేతాజీ చౌక్ వరకు పాదయాత్ర చేపట్టి అమరవీరుల స్తూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గద్వాలలో వంటావార్పు, నాగర్‌కర్నూల్‌లో మానవహారం నిర్వహించారు. రేవంత్ సర్కారు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జనవరి 2

# జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి



పెద్ద ఆదిరాలలో విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జడ్చర్ల, జనవరి 2 : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జడ్చర్ల మండలంలోని పెద్ద ఆదిరాల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పవన్ ఎంపికైనట్లు హెచ్‌ఎం మల్లయ్య, పీడీ మొయిన్ తెలిపారు. గత డిసెంబర్‌లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–17 రాష్ట్రస్థాయి పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరపున పవన్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు. పవన్ ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు మహారాష్ట్రలోని జల్గావ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనన్నాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి పవన్‌ను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు మధు, చంద్రశేఖర్, నార్యానాయక్, శ్యాంసుందర్, వెంకటయ్య, ఎల్లయ్య తదితరులు అభినందించారు.